అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శుక్రవారం 24 ఫిబ్రవరి 2023

సీసీ రోడ్డుకు భూమిపూజ

రెబ్బెన : మండలంలోని మాధవాయిగూడ గ్రామంలో ఈజీయస్ ద్వారా మంజూరైన రూ.4 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ డోబె పార్వతి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ మారుమూల గ్రామాలను అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నారన్నారు. అదేవిధంగా రోడ్డు లేని మారుమూల గ్రామాలకు తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక అన్ని గ్రామాలకు సీసీ రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. పేదలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోపాల్, బీఆర్ఎస్ నాయకులు ఆనంద్, విలాస్, వినోద్, గ్రామస్తులు పాల్గొన్నారు.



అడిషనల్ ఎస్పీ వాహనల తనిఖీ

ముథోల్ : మండలంలోని తరోడ గ్రామంలో గల భైంసా - బాసర రహదారిపై వాహనాల తనిఖీని ఆడిషనల్ ఎస్పీ కాంతిలాల్ పాటిల్ పరిశీలించారు. సిఐ వినోద్ నేతృత్వంలో ఎస్సై తిరుపతి ఆధ్వర్యంలో గురువారం వాహనాలను తనిఖీ చేయగా ఆడిషనల్ ఎస్పీ పరిశీలించారు. ప్రతి వాహనదారుడు సంబంధిత వాహనానికి నంబర్ ప్లేట్, వాహన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండి ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. వాహనాలకు నంబర్ ప్లేట్లు లేకపోయినా, మొబైల్‌లో మాట్లాడుతూ వాహనాలు నడిపితే ఉపేక్షించేది లేదన్నారు. వాటిని సీజ్ చేస్తామని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు.



వీధి కుక్కల వీరంగం..!

- మున్సిపాలిటీలు, పల్లెల్లో విచ్చలవిడిగా స్వైర విహారం
- పశువులు..మనుషులపై తరుచూ దాడులు
- కాలినడకన వెళ్లాలంటే జంకుతున్న జనాలు
- నివారణపై దృష్టిసారించని యంత్రాంగం

భీమారం మండల కేంద్రంలో నెల రోజుల క్రితం ఓ కుక్క ఒకేరోజున ఆరుగురిని తీవ్రంగా గాయపర్చింది. ఓ వ్యక్తిదైతే ఏకంగా చేతివేలును కొరికేసి భయానక వాతావరణం సృష్టించింది. ఈ పంచాయతీలో చాలా రోజుల నుంచి శునకాల బెడద ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.





లక్షెట్టిపేటలోనూ కుక్కల బెడద తీవ్రంగా ఉంది. వారం రోజుల క్రితం ఇక్కడి వార సంతలో శునకాలు బీభత్సం సృష్టించాయి. పిచ్చికుక్కల గుంపు అకస్మాత్తుగా దాడి చేసి ఏకంగా 11మందిని గాయపర్చాయి. ఇందులో తొమ్మిది మందిని మెరుగైన చికిత్స కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ కుక్కల శరీరంపై చర్మం తొలగిపోయి ఏదో వ్యాధి వచ్చినట్లు కనిపిస్తున్నా పురపాలక అధికారులు, సిబ్బంది దృష్టిసారించడం లేదు. ఇలా అనేక మున్సిపాలిటీలతో పాటు గ్రామాల్లోనూ వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది.

వీధి కుక్కలు వీరంగం సృష్టిస్తున్నాయి. వీటిని చంపడం నేరమైనప్పటికీ వీటి నియంత్రణకు అధికార యంత్రాంగం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. పట్టణం, పల్లె తేడా లేకుండా వీధి శునకాల బెడద తీవ్రమవుతోంది. ఏదైనా పనిమీద ఓ గల్లీలో లేదంటే కాలనీల్లో నడిచి వెళ్లాలంటే ముందుగా జనం కుక్కలకే భయపడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఒంటరిగా ఇంటికి వెళ్లలేని పరిస్థితి ఉంటుంది. రోడ్లపైనే పదుల సంఖ్యలో తిష్టవేసి ఉండటం..మనుషులను చూడగానే అరుస్తూ వెంటపడటంతో భయాందోళనకు గురవుతున్నారు. గతంలో వీటి బెడదను నివారించేందుకు మున్సిపల్, పంచాయతీ పాలకవర్గాలు దృష్టిసారించడం లేదు. తాజాగా హైదరాబాదులో ఓ బాలుడిని శనకాలు దాడిచేసి చంపివేసిన ఘటన అందరినీ కలిచివేసింది. ఇలాంటి పరిస్థితులు మరెక్కడా రావద్దని జనం కోరుతున్నారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో పట్టణాలు, పల్లెల్లో వీధి కుక్కల బెడద తీవ్రమవుతోంది. రోజూ ఏదో ఓ చోట కుక్కకాటు బాధితులు ఉంటున్నారు. ఆస్పత్రుల్లోనూ వీటి బాధితులు అధికంగానే కనిపిస్తున్నారు. వీటి నియంత్రణకు పంచాయతీ, మున్సిపాలిటీ పాలకవర్గాలు పూర్తిస్థాయిలో దృష్టిసారించిన దాఖలాలు కనిపించడం లేదు. ఏదైనా ఘటన జరిగిన సందర్భంలో స్పందిస్తూ వీటి నివారణకు తూతూ మంత్రపు చర్యలు చేపడుతున్నారు. కిందటేడాది మున్సిపాలిటీలు, పల్లెల్లో వీటిని పట్టుకునేందుకు ఇతర ప్రాంతాల నుంచి నిపుణులను రప్పించారు. వీటిని పట్టుకొని అటవీ ప్రాంతాల్లో విడిచిపెట్టారు. కానీ అక్కడ తిండి లభించకపోవడంతో మళ్లీ అవి జనావాసాల్లోకి వస్తున్నాయి. దీంతో కుక్కల బెడదను నివారించడం అనేది కొన్ని రోజులకే పరిమితమవుతోంది. ముఖ్యంగా వీటి సంతానోత్పత్తిని నివారించడానికి రెబిస్ టీకాలు వేయాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా యంత్రాంగం దృష్టిసారించడం లేదు. ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బంగారుగూడ డంపింగ్‌యార్డులో ప్రత్యేకంగా రూ.50లక్షలతో జంతు సంరక్షణ కేంద్రం నిర్మించారు. ఇక్కడే వీటిని సంతానోత్పత్తి నియంత్రణకు ఆపరేషన్లు చేసేలా చర్యలు చేపడుతున్నారు. ఇది కార్యరూపం దాల్చేందుకు మరిన్ని రోజులు పట్టే అవకాశం కనిపిస్తోంది.

రాత్రి వేళలో భయం..!

పట్టణాల్లో రోడ్లపైనే పదుల సంఖ్యలో కుక్కలు గుంపులుగా ఉంటున్నాయి. ఏదైనా పని నిమిత్తం కాలినడకన అటు వైపు వెళ్తే వెంటనే దాడి చేస్తున్నాయి. దీంతో చాలా మంది వీటి బారినపడి గాయపడుతున్న సందర్భాలున్నాయి. ప్రస్తుతం ఏ కాలనీలో చూసినా గుంపులు గుంపులుగా సంచరిస్తు భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.ఇవి వెంబడిస్తే పరుగెత్తలేని వృద్ధులు, చిన్నారులు ఎక్కువగా వీటి భారినపడుతున్నారు. బోథ్ మండలం ధనోరాలో ఓ బాలుడిని గాయపర్చడంతో పాటు ఆదిలాబాద్ పట్టణం భాగ్యనగర్‌లో ఓ వృద్ధురాలిని గాయపర్చాయి. ఇలా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అనేక మంది కుక్క కాటు బాధితులు ఉన్నారు. రాత్ర వేళలో ఒంటరిగా నడిచి వెళ్లాలంటే ముందుగా కుక్కలకే భయపడాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. హైదరాబాదు వంటి ఘటనలు జిల్లాలోనూ చోటు చేసుకోకుండా అధికారులు, పాలకవర్గాలు దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. వీటి సంతానోత్పత్తిని నియంత్రించే దిశగా చర్యలు చేపట్టాలని జనం కోరుతున్నారు.



సంతానోత్పత్తి నియంత్రణకు చర్యలు : కిషన్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి, ఆదిలాబాద్

శునకాల బెడదను నియంత్రణపై దృష్టి సారిస్తున్నాం. ముఖ్యంగా ఆదిలాబాద్ మున్సిపాలిటీ బంగారుగూడలో జంతు సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. ఇక్కడ శునకాల సంతానోత్పత్తిని నియంత్రించేందుకు ప్రత్యేకంగా ఆపరేషన్లు చేసేందుకు వైద్యుడు, సిబ్బందిని కూడా నియమించాం. త్వరలోనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆర్థికసాయం

నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ నియోజకవర్గం పరిధిలో గల వివిధ గ్రామాలకు చెందిన వారికి ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం అందించినట్లు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని వేలాల గ్రామానికి చెందిన గణేశ్ అనారోగ్యంతో బాధపడుతుండగా ఆధునిక వైద్యం కోసం సీఎం సహాయ నిధి నుండి రూ.1.75 లక్షలు అందజేసినట్లు తెలిపారు. అదేవిధంగా చెన్నూర్ పట్టణానికి చెందిన మురళీమోహన్, మందమర్రి మండలం పులిమడుగు గ్రామానికి చెందిన అంజయ్య, కోటపల్లి మండలం అన్నారం గ్రామానికి చెందిన రమేశ్, మందమర్రి పట్టణానికి చెందిన సుల్తానా వైద్యం కోసం ప్రభుత్వ పరంగా సీఎం రిలీఫ్ ఫండ్ నుండి మంజూరు చేసిన చెక్కులను బాధితులకు అందజేసినట్లు తెలిపారు. సహాయం కోరి వచ్చిన వారికి 24గంటల వ్యవధితో ఎల్ఓసీ ఇవ్వడంతో పాటు వారి వైద్య సేవల విషయంలో ఎప్పటికప్పుడు సమాచారం అడిగి తెలుసుకుంటున్నామని పేర్కొన్నారు. గడిచిన నాల్గు సంవత్సరాల్లో నియోజకవర్గంలో వివిధ గ్రామాలకు చెందిన 199 మందికి రూ.42 కోట్లు సీఎం రిలీఫ్ ఫండ్ నుండి ఆర్థిక సాయం అందించినట్లు పేర్కొన్నారు.

తెలంగాణ అమరవీరుల క్రీడలు ప్రారంభం



నవతెలంగాణ - బెజ్జూర్

మండల కేంద్రంలో తెలంగాణ అమరవీరుల క్రీడలను ఎమ్మెల్యే కోనేరు కోనప్ప గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్రీడాకారులతో మాట్లాడుతూ మండల కేంద్రంలో తెలంగాణ అమరవీరుల క్రీడలు నిర్వహించడం హర్షణీయమన్నారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆడి తమ ప్రతిభను చాటాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పుష్పలత, పీఏసీఎస్ చైర్మన్ ఓం ప్రకాష్, మండల కోఆప్షన్ సభ్యుడు బషరత్‌ఖాన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఘన సన్మానం



నవతెలంగాణ - ఖానాపూర్

పట్టణంలోని కుమురం భీం చౌరస్తా వద్ద అంబేద్కర్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించినందుకు గురువారం అంబేద్కర్ యువజన సంఘం, దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆమె నివాసంలో ఎమ్మెల్యే రేఖా నాయక్‌ను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమ ధ్యేయమని, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో మాట్లాడి భవన నిర్మాణానికి రూ.50లక్షలు మంజూరు చేయిస్తానని తెలిపారు. రానున్న అంబేద్కర్ జయంతిని అక్కడే ఘనంగా జరుపుకుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో దళిత, అంబేద్కర్ యువజన సంఘ సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, బీఆర్ఎస్ అభిమానులు పాల్గొన్నారు.

గంగపుత్ర మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నిక



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని రాంపూర్ గంగపుత్ర మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా కల్లెడ స్వరూప, ఉపాధ్యక్షురాలిగా గుమ్ముల నర్సమ్మ, కార్యదర్శిగా కల్లెడ సుజాత, డైరెక్టర్స్‌గా కల్లెడ శంకరమ్మ, గుమ్ముల రాజేశ్వరి, పల్లికొండ లక్ష్మి, కల్లెడ లక్ష్మి, నాగుల నర్సమ్మ, దామరకుంట సుజాత ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి వి.శృతి తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలు కల్లెడ స్వరూప మాట్లాడుతూ మహిళా సంఘాలు లేని గ్రామాల్లో సంఘాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అలుగునూరి సులోచన రవి, గ్రామ కార్యదర్శి వెంకటయ్య పాల్గొన్నారు.

కేవీ ప్రతాప్‌పై దాడి అమానుషం

నవతెలంగాణ-మంచిర్యాల

ఆర్యవైశ్య సమాజానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కెవి.ప్రతాప్ రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక గుర్తుతెలియని నాయకులు దాడి చేయడం అమానుషమని ఆర్యవైశ్య సంఘం నాయకులు తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఇలాంటి దాడులు వైశ్యులపై కొనసాగితే తమ సత్తా ఏంటో ఎన్నికలలో చూపిస్తామని హెచ్చరించారు. ఇలాంటి దాడులు పునరావృతమైతే జిల్లా, రాష్ట్రస్థాయిలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులు ముక్తా శ్రీనివాస్, జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు రేణిగుంట్ల శ్రీనివాస్, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దొంతుల ముఖేష్, వాసవి ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు కంభంపాటి కమలాకర్, ఆర్యవైశ్య మహాసభ జిల్లా పిఆర్ఓ కేశెట్టి వంశీకృష్ణ పాల్గొన్నారు.

నిజాయితీని చాటుకున్న యువకుడు సాయికృష్ణ



నవతెలంగాణ - దహెగాం

మండలంలోని కొంచవెల్లి గ్రామానికి చెందిన యువకుడు గుల్బం సాయికృష్ణ తనకు దొరికిన బ్యాగును, అందులోని నగదు, విలువైన వస్తువులను బాధితుడికి అందజేసి తన నిజాయితీని చాటుకున్నాడు. కొంచవెల్లి గ్రామానికి చెందిన గుల్బం సాయికృష్ణ బెల్లంపల్లి నుండి తన స్వగ్రామం కొంచవెల్లికి తిరిగి వస్తున్న క్రమంలో కన్నెపెల్లి, వీగాం మధ్యలో హ్యాండ్‌బ్యాగ్ రోడ్డుపై కనిపించింది. బ్యాగును తెరిచి చూసేసరికి అందులో రూ.5200 నగదు, ఆండ్రాయిడ్ మొబైల్‌ఫోన్, బ్రాస్‌లెట్‌తో పాటు హాస్పిటల్ రిపోర్టులు ఉన్నాయి. వెంటనే గ్రామానికి చేరుకున్న అతడు అందులోని వివరాల ఆధారంగా బెల్లంపల్లి పట్టణానికి చెందిన దదావత్ రంజిత్‌కుమార్‌వి అని తెలుసుకొని అతని మొబైల్‌కు ఫోన్ చేసి విషయం తెలియజేశారు. అతడు కొంచవెల్లి గ్రామానికి చేరుకొని స్థానిక నాయకులు రౌతు రాజన్న ఆధ్వర్యంలో బాధితుడికి బ్యాగును అందజేయడంతో బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు. బ్యాగు లభించిన శుభ సందర్భంగా స్థానికంగా నిర్మిస్తున్న నూతన ఆలయానికి రంజిత్‌కుమార్ రూ.వెయ్యి విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు మధుకర్, శ్యాం, శ్రీకాంత్ పాల్గొన్నారు.

25న బీసీ జాగృతి రౌండ్ టేబుల్ సమావేశం

నవతెలంగాణ-మంచిర్యాల

ఈ నెల 25న తెలంగాణ బీసీ జాగృతి రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు నరేడ్ల శ్రీనివాస్ కోరారు. జిల్లా అఖిల గాండ్ల సంఘ భవనంలో గురువారం సంఘ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజకవర్గ బిసి ఎమ్మెల్యే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం 25న శనివారం ఎఫ్‌సిఎ ఫంక్షన్ హాల్‌లో ఉంటుందన్నారు. దీనికి బీసీ కుల సంఘం నాయకులు, ఉద్యోగ సంఘ నాయకులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, న్యాయవాదులు, డాక్టర్లు, జర్నలిస్టులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో తెలంగాణ బీసీ జాగృతి పట్టణ అధ్యక్షులు మడుపు రామ్‌ప్రకాష్, ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి లక్ష్మణ్, ఉపాధ్యక్షులు వైద్య భాస్కర్, జక్కం రవీందర్, అఖిల గాండ్ల సంఘం జిల్లా అధ్యక్షులు బుద్ది చంద్రమౌళి, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ నులిగొండ ప్రకాష్, గుర్రం రాజేశంగౌడ్, సంతోష్ పాల్గొన్నారు.

మోర్రిగూడలో కంటి వెలుగు ప్రారంభం



నవతెలంగాణ-జన్నారం

కంటి వెలుగు శిబిరాన్ని గురువారం మండలంలోని మోర్రిగూడలో సర్పంచి భూక్య రాజగోపాల్, ఎంపిటిసి జునుగురి దుర్గా మాధురి సతీష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలందరూ కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉచితంగా పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలతో సహా మందులు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైద్య అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వేమనపల్లి : మండలంలోని నీల్వాయి గ్రామ పంచాయతీలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ గాలి మధు, ఎంపీటీసీ రుద్రభట్ల సంతోష్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మయ్య, మెడికల్ ఆఫీసర్ డా. బి రాజేష్, క్యాంపు కోఆర్డినేటర్ రాంశెట్టి బాపు, ఆప్తాల్మిక్ ఆఫీసర్ చైతన్య, హెల్త్ అసిస్టెంట్ లింగయ్య, డాటా ఎంట్రీ ఆపరేటర్ జావీద్, ఎఎన్ఎంలు తిరుపతమ్మ, కళావతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు ఆన్‌లైన్ దరఖాస్తులు విడుదల

నవతెలంగాణ - కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని తెలంగాణ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగ భవనంలో గురువారం జిల్లా నుండి హజ్ 2023కు వెళ్లే యాత్రికుల కొరకు హజ్ సొసైటీ కార్యదర్శి ముఫఖం ఆధ్వర్యంలో ముఖ్యఅతిథిగా కేంద్ర హజ్ కమిటీ శిక్షకులు అల్-హజ్ ఆరిఫ్ అహేమద్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ దరఖాస్తులను విడుదల చేశారు. ఈ సేవలను ఉచితంగా హజ్ సొసైటీ కార్యదర్శి ముఫఖం కార్యాలయం నవాజ్ టూర్స్‌లో ఫిబ్రవరి 10 నుండి మార్చి 10 వరకు పొందవచ్చని తెలిపారు. వివరాలకు జిల్లా నుండి యాత్రకు వెళ్లే వారు ముఫఖం కార్యదర్శి 9440086037కు సంప్రదించవచ్చని తెలిపారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని మౌలానా ఇంతేఖాబ్ ఆలం తిలావత్-ఎ-ఖురాన్ ప్రార్థన చేసి ప్రారంభించారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు, మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, ఆసిఫాబాద్ జిల్లా హజ్ యాత్రలకు వెళ్లే వారి దరఖాస్తులను ప్రారంభించారు. అనంతరం హజ్ సొసైటీ ప్రధాన కార్యదర్శి ముఫఖం అహ్మద్ మాట్లాడుతూ హజ్ యాత్రకు వెళ్లే వారికి కోవిడ్ వ్యాక్సిన్ మొదటి డోస్‌ను ఆన్‌లైన్‌లో అనుమతించడం లేదని అన్నారు. డీఎంహెచ్‌ఓతో మాట్లాడి యాత్రికులందరికీ వ్యాక్సిన్ ఇప్పిస్తానని కోనేరు కృష్ణారావు, మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హజ్ కమిటీ శిక్షకులు అల్-హజ్ ఆరిఫ్ అహ్మద్, ఖలీల్ ఉద్దీన్, ఆఫీస్ రియాజ్, జిల్లా కో ఆప్షన్ సభ్యులు సిద్దిక్, అబ్దుల్ సుభాన్ పాల్గొన్నారు.

పెండ్లి రోజునే షాదీ ముబారక్ చెక్కు అందజేత



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

పెళ్లి రోజునే ఓ నిరుపేద లబ్ధిదారునికి షాదీ ముబారక్ చెక్కును ఎమ్మెల్యే జోగు రామన్న అందజేశారు. పట్టణంలోని బొక్కల్‌గూడని అయిషా మసీదులో గురువారం ఇరు కుటుంబాలతో నిర్వహించిన నికా కార్యక్రమంలో ఆయన పాల్గొనారు. పెళ్లి రోజునే చెక్కు అందడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే జోగురామన్న మాట్లాడుతూ దేశం దృష్టిని ఆకర్షించేలా అనేక కార్యక్రమాలను ప్రవేశపెట్టిన ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కుతుందని పునరుద్ఘాటించారు. ఆడ పిల్లల పెళ్లిళ్ల సమయంలో తల్లిదండ్రులు ఇబ్బంది పడకూడదన్న సదుద్దేశంతో షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి పథకాలను ప్రవేశపెట్టి వారికి అండగా నిలుస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, కో ఆప్షన్ సభ్యులు ఎజాజ్, షాహిద్ తవక్కల్, ఇసార్, మంజూర్ మౌలానా పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం నిధులతోనే గ్రామాల అభివృద్ధి



నవతెలంగాణ - పెంచికల్‌పేట్

కేంద్ర ప్రభుత్వం నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి జరుగుతోందని బీజేపీ నాయకుడు పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. గురువారం మండలంలోని చెడ్వాయి, పోతెపెల్లి, ఎలుకపెల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రజాగోస - బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. 9 ఏండ్ల నుండి ఒక్క ఎకరానికి కూడా నూతనంగా నీరు ఇవ్వలేదని, ఉచ్చమల్లెవాగు కాలువలు పూర్తికాలేదని, బొక్కివాగు కాలువలు అసంపూర్తిగా ఉన్నాయని, జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు 90 శాతం పూర్తయిన ఎమ్మెల్యే పట్టించుకోవడంలేదని విమర్శించారు. గిరిజనులకే కాకుండా గిరిజనేతరులకు సైతం పోడు భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు జునగరి మధుకర్, బీజేవైఎం జిల్లా మండలాధ్యక్షుడు పాలె సంతోష్, శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు శంకర్‌గౌడ్, కడంబ శ్రీనివాస్, కాంతారావు, ప్రధాన కార్యదర్శులు కర్న మహేష్, రాజేశ్వర్, సిరిపురం భీమయ్య, నాయకులు సొద్దరి గంగన్న, పొచ్చన్న, నానయ్య, నగేష్, వెంకటేశ్వర్, ఎంకటి, మహేష్, సంతోష్, భుజంగరావు, చందు, దామోదర్, బాపూజీ పాల్గొన్నారు.

నర్సరీల్లో షెడ్ నెట్లు ఏర్పాటు చేయాలి

- జిల్లా పంచాయతీ అధికారి ఫణీందర్‌రావు



నవతెలంగాణ-జైపూర్

వేసవి ఎండల తీవ్రత పెరుగుతున్నందున వెంటనే నర్సరీల్లో షెడ్ నెట్లు ఏర్పాటు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఫణీందర్‌రావు ఆదేశించారు. మొబైల్ యాప్ ఇన్స్‌పెక్షన్‌లో భాగంగా గురువారం కానుకూరు గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ పరిధిలో కొనసాగుతున్న పారిశుధ్య పనులు పరిశీలించారు. అనంతరం నర్సరీని సందర్శించిన ఆయన నిరంతరాయంగా అంతర్గత రోడ్లు, మురికి కాలువలు పరిశుభ్రం చేయాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ద్వారా ఇంటింటి చెత్తను సేకరించి సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించాలని సూచించారు. సెగ్రిగేషన్ షెడ్డులో కంపోస్టు ఎరువు తయారీని పరిశీలించారు. పల్లె ప్రకృతివనం, శ్మశాన వాటికలను సందర్శించిన ఆయన శ్మశాన వాటిక పరిసరాలను పరిశుభ్రం చేయాలని ఆదేశించారు. పల్లె ప్రకృతి వనంలో గల చెట్లకు ప్రతి రోజు నీళ్లు పోయాలన్నారు. తెలంగాణ క్రీడా ప్రాంగణం కొరకు స్థలం గుర్తించి వెంటనే పనులు ప్రారంభించాలని సూచించారు. ఈ నెలాఖరుకు ఇంటి పన్ను వసూళ్లు వంద శాతం పూర్తి చేయాలని, వసూల్ అయిన డబ్బులు గ్రామ పంచాయతీ సాధారణ నిధిలో జమ చేయాలన తెలిపారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డుల నిర్వహణ తీరును తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ అనిల్ కుమార్, సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి సురేందర్ పాల్గొన్నారు.

సంత్ గాడ్జెబాబా 146వ జయంతి

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక జశ్వంత్ బుద్ధవిహార్‌లో గురువారం సంత్ గాడ్జెబాబా 146వ జయంతిని అంబేద్కర్ సంఘం నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు పాండు, విజయ్, రోశన్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్
2
శుక్రవారం 24 ఫిబ్రవరి 2023

ఆధార్ లింక్ విరమించుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

దేశంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి చెందిన పీఎం పోషన్ పోర్టల్‌లో తప్పకుండా ఆధార్ కార్డు అప్లోడ్ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు వెంటనే విరమించుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆత్రం నగేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందకుండా పోతుందన్నారు. దానివల్ల విద్యార్థులు చదువుకు దూరమయ్యే అవకాశం పేర్కొన్నారు. మధ్యాహ్న భోజనం పెట్టడంతో విద్యార్థుల సఖ్య పెరిగిందని, కానీ ఈ నిర్ణయం వల్ల విద్యార్థులు నాణ్యమైన భోజనంతో పాటు చదువుకు దూరమయ్యే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే అనేకమంది వారి వెళిముద్రలు, బయోమెట్రిక్ సమస్యలు వల్లన ఆధార్ జారీ కానీ వారు కూడా చాలామంది ఉన్నారన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

జిల్లాలోని గజిటెడ్ అధికారుల సమస్యల పరిష్కారానికి అనునిత్యం కృషి చేస్తున్నట్లు తెలంగాణ గజిటెడ్ అధికారుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అజ్మీరా శ్యామ్ నాయక్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని రిమ్స్ వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖకు చెందిన గజిటెడ్ అధికారులు అనిల్ కాములు, సిడాం వామన్ రావ్, బాబులాల్, బ్రహ్మానందరెడ్డి, విజయ, శారద, కృష్ణలత, సిరాజ్, అర్షద్, భూమయ్య, వేణుగోపాల్ రెడ్డిలతో పాటు పలువురికి తెలంగాణ గజిటెడ్ అధికారుల సంఘం సభ్యత్వ నమోదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గజిటెడ్ అధికారులు హక్కులను కాపాడేందుకు, అధికారుల సంక్షేమం కోసం టీజీఓ పాటుపడుతుందని అన్నారు. అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహించడంతో పాటు సంఘటితంగా ఉండాలని కోరారు. సమావేశంలో టీజీఓ కార్యదర్శి వనజారెడ్డి, కోశాధికారి శివకుమార్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు జీఓనెం.60 ప్రకారం వేతనాలు ఇవ్వాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్

నవతెలంగాణ-కడెం

గ్రామపంచాయతీ కార్మికులకు జీఓనెం.60 ప్రకారం వేతనాలు ఇవ్వాని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ నిర్మల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరుగు గ్రామ పంచాయతీ కార్మికుల పాదయాత్రకు సంఘీభావ యాత్ర గురువారం ధర్మజీపేట్ నుండి కడెం వరకు గ్రామపంచాయతీ కార్మికులు పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ హజరయ్యారు. మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ లింబాద్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులకు ఒక్కో గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు లేక పోవడంతో ఆర్థికంగా కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్మికులకు వేతనాలు విడుదల చేయకపోవడంతో ఇల్లు గడవలేని పరిస్థితిలో కార్మికులు నానా తంటాలు పడుతున్నారని అన్నారు. కార్మికులకు ప్రతి నెల 5వ తేదీ లోపు వేతనాలు విడుదల చేయాలని అన్నారు. 11వ పీఆర్సీ వర్తింపజేసి 30శాతం వేతనం పెంచాలని అన్నారు. కనీస వేతనం నెలకు రూ.26వేలు ఇవ్వాలని అన్నారు. జీఓనెం.60 ప్రకారం రూ.15వేల 600 వేతనం నిర్ణయించాలని అన్నారు. మున్సిపాలిటీ కార్మికులకు ఏ విధంగా వేతనాలు ఇస్తున్నారో అదే విధంగా గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు ఇవ్వాలని అన్నారు. సబ్బులు, యూనిఫామ్, బెల్లం, నూనె, ఆదివారం సెలవు ఇవ్వాలని అన్నారు. అలాగే కార్మికుల పట్ల అధికారుల వేధింపులు అరికట్టాలని అన్నారు. మల్టీపర్పస్ విధానాలతో కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకుంటూ వేతనాలు మాత్రం సక్రమంగా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులతో తమ కుటుంబాన్ని గడిపే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. కార్మికులకు ఇవ్వాల్సిన వేతనాలను కూడా గ్రామపంచాయతీ ప్రజాప్రతినిధులు వాడుకొని కార్మికులకు మాత్రం మొండిచేయి చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం బీజేపీ తెచ్చిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని అన్నారు. మోడీ నిర్ణయించిన వేతనం రోజుకి రూ.178 మాకొద్దని అన్నారు. కనీస వేతనం నెలకు రూ.26వేలుగా నిర్ణయించాలని అన్నారు. జీఓనెం.60 ప్రకారం రూ.15వేల 600లు, కారోబారి బిల్ కలెక్టర్లు రూ.19వేల 500లు, కంప్యూటర్ ఆపరేటర్లకు రూ.22వేల 750 వేతనం చెల్లించాలని అన్నారు. యాక్ట్ 2/94ను రద్దు చేసి పంచాయతీ సిబ్బంది అందరిని పర్మినెంట్ చేయాలని అన్నారు. పంచాయతీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించి,



ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని అన్నారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.నర్సయ్య గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మండల అధ్యక్షుడు గోవింద్, మండల కార్యదర్శి నరేష్, కారోబారి ప్రశాంత్, నర్సయ్య నాయకులు రాములు, పోశలింగ్, రాజేందర్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

బంజారాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

బంజారాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదాన్‌లో సంత్ శ్రీసేవాలాల్ మహారాజ్ 284వ జయంతిని ప్రభుత్వం అధికారికంగా ఘనంగా నిర్వహిస్తుందని అన్నారు. సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల్లో వేడుకల్లో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్, జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్, బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి జోగు రామన్న ముఖ్యఅతిథిగా హజరయ్యారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోని ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని అన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత సమాజంలోని అన్ని మతాల వారికీ ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపునిస్తుందని అన్నారు. అదే విధంగా బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ప్రతి జిల్లాలో అధికారికంగా నిర్వహించుకోవడం జరుగుతుందని తెలిపారు. పట్టణంలో కోటి రూపాయల నిధులతో బంజారా భవన్ నిర్మాణ పనులకు త్వరలోనే భూమిపూజ చేస్తామని తెలిపారు. గిరిజన ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రవేశ పెట్టి అమలు చేస్తున్నదని వివరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సంత్ సేవాలాల్ మహారాజ్ 284వ జయంతి సందర్భంగా అందరికి శుభాకాంక్షలు తెలిపారు. సమాజం సన్మార్గంలో పయనించేలా అహర్నిశలు కృషిచేసిన మహనీయుల జయంతి ఉత్సవాలను రాష్ట్రం ఏర్పడిన తరువాత అధికారికంగా నిర్వహించుకోవడం జరుగుతున్నదని అన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని ఘనంగా అన్ని ఏర్పాట్లతో సాంప్రదాయ బద్ధంగా నిర్వహించుకుంటున్నామని అన్నారు. బంజారాల సంస్కృతి సాంప్రదాయాల నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయని అన్నారు. సేవాలాల్ మహారాజ్ జీవితాన్ని స్ఫూర్తిగా సూత్రాలను పాటించాలని తెలిపారు. ప్రకృతిని, సాటి మనిషిని ప్రేమించాలని, అడవులను కాపాడాలని సేవాలాల్ మహారాజ్ సమాజానికి బోధించేవారని అన్నారు. భవిష్యత్ తరలవారు ఇదే సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ సేవాలాల్ జయంతి వేడుకలను నిర్వహించుకోవాలని, ఆయన సూచించిన బాటలో ప్రతి ఒక్కరూ పయనించాలని అన్నారు. జిల్లా కేంద్రంతో పాటు ఉట్నూర్‌లో బంజారా భవన్ ఏర్పాటుకు ఎకరం స్థలం గుర్తించడం జరిగిందని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరుగుతుందని తెలిపారు. బంజారాల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం తరపున పూర్తి కృషి చేస్తామని తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ రాథోడ్ జనార్ధన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను అధికారికంగా పండగ వాతావరణంలో నిర్వహించుకోవడం జరుగుతుందని అన్నారు. అందుకు ప్రభుత్వానికి బంజారాల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బంజారాల సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలనీ కోరారు. బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు మాట్లాడుతూ సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పేద వర్గాల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి అమలు పరుస్తున్నదని వివరించారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఫించన్లు, రైతుబంధు, రైతు భీమా, కేసీఆర్ కిట్, కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ వంటి అనేక సంక్షేమ పథకాలను అర్హులైన లబ్దిదారులకు నిరంతరంగా అందజేయడం జరుగుతుందని అన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా



ఉండాలని, కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థానంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 284వ జయంతి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. బంజారాల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసిన మహనీయుడు సేవాలాల్ అని అన్నారు. అందరి సహకారంతో శాంతి భద్రతలను పోలీస్ శాఖ ద్వారా పటిష్టంగా అమలు చేస్తున్నామని అన్నారు. అంతకుముందు కలెక్టర్, ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్మెన్, ఎస్పీ, అధికారులు, ప్రజాప్రతినిధులు సంత్ సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తెలంగాణ సాంస్కృతిక సారథి ఆటపాటలు, బంజారాల సాంప్రదాయ నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం బంజారా సేవాలాల్ జయంతి గీతం పాటల సీడీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి అమర్ సింగ్ తిలావత్, ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత, జెడ్పీటీసీ అనిల్ యాదవ్, ఆర్డీవో రమేష్ రాథోడ్, డాక్టర్ నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, కౌన్సిలర్ జాదవ్ పవన్ నాయక్, మాజీ పార్లమెంట్ సభ్యుడు గోడం నగేష్, నాయకులు భరత్, సుమన్ పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యవర్గంలో జిల్లా నాయకురాలికి చోటు



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఎన్నికలను హైదరాబాద్‌లోని రెడ్డి హాస్టల్లో గురువారం నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన రాష్ట్ర కార్యవర్గంలో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన బి.భాగ్యలక్ష్మి ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. జిల్లా బీసీ వెల్ఫేర్ శాఖలో అడ్మినిస్ట్రేషన్ అధికారిగా ఆమె విధులు నిర్వహించి, పదవీ విరమణ పొందారు. అలాగే టీఎన్జీఓ సంఘం ఆదిలాబాద్‌లో వివిధ హోదాలలో పనిచేసి గుర్తింపు పొందారు. ఉపాధ్యక్షులుగా ఎన్నికైన ఆమెకు టీఎన్జీఓ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంద అశోక్, ఎడ్ల నవీన్ కుమార్, ఆదిలాబాద్ జిల్లా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు లక్ష్మారెడ్డి, కార్యదర్శి కిష్టయ్య, నిర్మల్ జిల్లా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఎం.లింగన్న, కార్యదర్శి హన్మంత్‌రెడ్డితో పాటు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు దీపక్, ప్రభాకర్ పాల్గొన్నారు.

సంగ్రామ పాదయాత్రను విజయవంతం చేయండి

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

మాదిగల సంగ్రామ పాదయాత్రను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ మల్లేష్ కోరారు. గురువారం స్థానిక మినీ తనీషా గార్డెన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 27న రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ టు మేడ్చల్ సంగ్రామ పాదయాత్ర నిర్వహించనున్నామని తెలిపారు. ఆరోజు జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి హైదరాబాద్ మేడ్చల్ వరకు మాదిగల సంగ్రామ పాదయాత్ర ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఆ యాత్రను ప్రారంభించడానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ హాజరవుతారని అన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణలో కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న మోసపూరిత వైఖరికి నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా మార్చి 15న రాజధానినలు వైపులా ప్రధాన జాతీయ రహదారులను దిగ్బంధం చేయనున్నట్టు తెలిపారు. ఆ యాత్రను జయప్రదం చేయడం కోసం జిల్లా వ్యాప్తంగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి, అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు జిల్లా బడుగు గంగయ్య, బరుకుంట సుభాష్, గైక్వాడ్ సూర్య కాంత్, చిట్టి రవి, ఉప్పులేటి, అడ్డిగెం సునిల్, దర్శనాల జైపాల్, జితేందర్ పాల్గొన్నారు.

బ్లడ్ క్యాన్సర్ వ్యాధితో బాలుడు మృతి

నవతెలంగాణ-కడెం

మండలంలోని పాండ్వాపూర్ గ్రామానికి చెందిన పెద్ది జెశ్వంత్ (12) ఏడో తరగతి విద్యార్థి బ్లడ్ క్యాన్సర్‌తో మృతి చెందాడు. పెద్ది సునీత రమేష్ దంపతుల ఏకైక సంతానం అయిన పెద్ది జెశ్వంత్ (12) ఏండ్ల బాలుడు గత కొన్ని నెలలుగా బ్లడ్ క్యాన్సర్ వ్యాధితో హైదరాబాద్‌లో చికిత్స పొందాడు. బుధవారం స్వగ్రామానికి తీసుకువచ్చారు. గురువారం తెల్లవారు జామున మృతి చెందాడు. జెశ్వంత్ మృతితో పాండ్వాపూర్ గ్రామంలో విషాదఛ్చాయలు అలుముకున్నాయి.

స్వేరోస్ ఫెలోషిప్‌కు దరఖాస్తు చేసుకోండి

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మెడిసిన్, ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఎంబీఏ, పీజీ, గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ స్థాయిలో ప్రొఫెషనల్ కోర్సుల్లో చదువుతూ 80 శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు స్వేరోస్ నెట్వర్క్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఇస్తున్నట్టుగానే ఈ సంవత్సరం కూడా చదువులో రాణిస్తున్న ప్రతిభావంతులకు స్వేరో ఫెలోషిప్, లాప్‌టాప్ ఇస్తున్నారని వెంటనే దరఖాస్తు చేసుకోవాల్సిందిగా స్వేరోస్ ఇంటర్నేషనల్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు కాంబ్లే విజయ్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా లేని నిరుపేద విద్యార్థులకు ఈ స్వేరో ఫెలోషిప్ ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి దోహదపడుతూ వారి ఆర్థిక సమస్యలకు పరిష్కారం చూపించే మార్గంగా స్వేరోస్ నెట్వర్క్ నిలబడుతుందన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు స్వేరోస్ వెబ్ సైట్‌ను సందర్శించి, అందులో ఉన్న ఫార్మాట్ డౌన్లోడ్ చేసుకోవాలని అన్నారు. ఈనెల 25 వరకు అప్లై చేసుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. ఫార్మాట్‌ని నింపి స్వేరోస్ హెడ్ ఆఫీస్,10-2-289, 120/22, 2వ ఫ్లోర్, పిఎస్ నగర్, మాసబ్ ట్యాంక్, హాకీ గ్రౌండ్ వెనుకలా, హైదరాబాద్-500057 కు పోస్టులో పంపాలిని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని స్వేరోస్ పక్షాన కోరుతున్నామని అన్నారు.

బీసీ సంక్షేమ సంఘం నూతన గ్రామ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-తలమడుగు

ఖోడద్ గ్రామంలో బీసీ సంక్షేమ సంఘం గ్రామకమిటీని ఆ సంఘం నాయకులు గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కల్లూరి మల్లయ్య, అధ్యక్షుడిగా నీలగిరి యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా పూదారి సంతోష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కర్నేవారు వినాయక్, ప్రచార కార్యదర్శిగా సునీల్, కోశాధికారి గాడిచర్ల నరేష్, ఉపాధ్యక్షుడిగా బోనగిరి నరేష్, తాటికొండ గంగాధర్, శ్రీరామ్ రాము, సలహాదారులుగా ఓరుగంటి పురుషోత్తం, బండి సత్య గౌడ్, పసుపుల దేవన్న, మర్రి వెంకన్న, లతోపాటు 20 మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షులు నీలగిరి యాదగిరి మాట్లాడుతూ ఖోడద్ గ్రామంలో బీసీ సంఘం బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. అందరి సహకారంతో సంఘాన్ని ముందుకు తీసుకువెళ్తామన్నారు. బీసీ సంఘం మండల కమిటీ పిలుపుమేరకు పనిచేస్తామన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసుకున్న నూతన కమిటీతో పాటు, మండల నాయకులు రవికాంత్ యాదవ్‌ను గ్రామస్తులు శాలువా లతో సత్కరించారు. కార్యక్రమంలో కజ్జర్ల బీసీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ శర్త రవి, నాయకులు జక్కుల రవీందర్, పురుషోత్తం, మల్లయ్య, గంగాధర్, స్వామి పాల్గొన్నారు.

పశువులకు నట్టల నివారణ మందులు తప్పనిసరి

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

గొర్రెల కాపరులు ప్రతి గొర్రెకూ తప్పనిసరిగా నట్టల నివారణ మందులు వేయాలని మండల పశు వైద్యాధికారి పర్వీజ్ హైమాద్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో గొర్రెలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. అనంతరం అయన మాట్లాడుతూ గొర్రెలకు సీజనల్ వ్యాధ్యులు నివారించేందుకు ముందస్తుగా నట్టల నివారణ మందులు వేయాలని గొర్రెకాపరులకు సూచించారు. నట్టల మందు సకాలంలో వేయించకపోతే పశువులలో నట్టలుండి, రక్తాన్ని పీల్చి పశువుని బక్కచిక్కేవిధంగా తయారు చేస్తాయన్నారు. చివరికి గొర్రెలు, మేకలు నీరసించి మృత్యువాత పడుతాయని తెలిపారు. జీవాల పెంపకదారులు అందరూ తప్పకుండా మేకలకు, గొర్రెలకు నట్టల నివారణ మందులు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చట్ల విలాస్, సాయన్న, పరమేశ్వర్, తాంద్ర పోతన్న, శంకర్, గంగాధర్ పాల్గొన్నారు.

బాసర ఆలయ అభివృద్ధికి నిధుల మంజూరు

నవతెలంగాణ బాసర

దక్షిణ భారతదేశంలోని ఏకైక చదువుల తల్లి నిలయం బాసర క్షేత్రం అక్షర శ్రీకర పూజలకు కొలువైన ఈ క్షేత్రంలో అభివృద్ధి పనులకు అడుగుపడుతున్నాయి. గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఆలయ అభివృద్ధికి రూ.50 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధుల్లో రూ.8 కోట్లు ఆలయ ఏసీ వసతి భవనాలపై వసతి గదులను, భక్తులు సేద తీరేందుకు షెడ్డులను నిర్మించారు. ప్రధానంగా అమ్మవారి వసంత పంచమి దేవీ నవరాత్రి ఉత్సవాల సమయాల్లో భక్తుల రద్దీతో చిన్నారులు మహిళలు వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. క్యూ కాంప్లెక్స్, మరుగుదొడ్లు, త్రాగునీటి సౌకర్యాలు అందుబాటులోకి వస్తే భక్తులకు ఇబ్బందులు తీరే అవకాశం ఉంటుంది.

పనులకు శృంగేరి పీఠం అనుమతి..

దేవాదాయ శాఖ అధికారులు, అర్చకులు ఇంజనీర్ అధికారుల బృందం శృంగేరి పీఠధిపతి అనుమతి కోసం కర్ణాటకకు వెళ్లారు. గర్భాలయ పనుల మాస్టర్ ప్లాన్ ఆగమ శాస్త్రం నిబంధనలకు లోబడి ఉందని శృంగేరి పీఠధిపతి పనులకు అనుమతి ఇచ్చినట్లు ఆలయ స్థాన చార్యులు, ప్రధాన అర్చకులు ప్రవీణ్ పాటక్, సంజీవ్ పూజారి తెలిపారు. గతంలోనే గర్భాలయ కొలతలను ఆలయ, ఇంజనీరింగ్ అధికారులు సేకరించారు. గర్భాలయాన్ని కృష్ణశిలలతో నిర్మించాలని సంకల్పించరు. వీటితో పాటు కొనేరును కుదించనున్నట్లు, శివ, మహంకాళి ఆలయాన్ని నూతనంగా నిర్మించి ప్రాకార మండపం విస్తరణతో పాటు ఉత్తరం, తూర్పు, దక్షిణం, పడమర లకు రాజ గోపురాల పనులను చేపట్టనున్నారు. అనుమతుల విషయాన్ని దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, దేవాదాయ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆలయ గర్భాలయా వెడల్పు, మాస్టర్ ప్లాన్ అమలును ముఖ్యమంత్రి అనుమతితో త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు.

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించాలి

- ఎమ్మెల్యే విఠల్ రెడ్డి



నవతెలంగాణ-బాసర

రైతులు తాము పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలని ఎమ్మెల్యే విఠల్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సొసైటీ గోదాం వద్ద బిద్రెల్లి సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శనగ కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే విఠల్ రెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. రైతుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కట్టుబడి ఉన్నారని, శనగ కోతలు ప్రారంభం కావడంతో శనగకు ప్రభుత్వం రూ.5330 మద్దతు ధర ఇస్తుందని తెలిపారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్ర రైతులకు నాణ్యమైన ఉచిత కరెంటు అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందని అన్నారు. దేశవ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీని రైతులు ఆదరిస్తారని వచ్చేది కిసాన్ సర్కారేనని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బిద్రెల్లి పీఏసీఎస్ చైర్మెన్ వెంకటేష్ గౌడ్, సర్పంచ్ లక్ష్మణరావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నర్సింగ్ రావు, పీఏసీఎస్ డైరెక్టర్లు రమేష్ రావు, నరేష్, పీఏసీఎస్ మాజీ చైర్మెన్ రామారావు, బీఆర్ఎస్ మండల కన్వీనర్ కోర్వ శ్యామ్, మల్కన్న యాదవ్, మల్లయ్య యాదవ్, బాబురావు పటేల్, దేవేందర్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు రైతులు, సొసైటీ అధికారులు పాల్గొన్నారు.

అంతర్‌రాష్ట్ర గంజాయి ముఠా గుట్టురట్టు

- రూ.9 లక్షల విలువ చేసే 92 కిలోల గంజాయి పట్టివేత
- వివరాలు వెల్లడించిన ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అంతర్‌రాష్ట్ర గంజాయి స్మగ్లింగ్ ముఠా గుట్టురట్టు చేశారు. పోలీసులు 92 కిలోల గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.9 లక్షలకుపైగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మరో నలుగురు పరారీలో ఉండటంతో వారి కోసం గాలిస్తున్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను మావల పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ ఉమేందర్‌తో కలిసి ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. ఉట్నూర్‌కు చెందిన రెహామాన్‌ఖాన్, పవార్ రాజు, రాథోడ్ శ్రీకర్, సద్దాం ఖాన్, గావాలె తుకారాం, సిద్దాం హుస్సేన్ జన్నారంకు చెందిన వెంకటేష్, కల్లడ గ్రామానికి చెందిన మహిప్ వీరంతా స్నేహితులు. వీరందరూ జల్సాలకు అలవాటుపడి తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆశతో గంజాయి సరఫరా చేయడం, అమ్మడం ద్వారా సులభంగా డబ్బులు సంపాదించవచ్చని నిర్ణయించుకున్నారు. ఆంధ్రా, ఒరిస్సా బోర్డర్ సమీపంలో గంజాయి చౌకగా లభిస్తుందని తెలుసుకుని తక్కువ ధరకు గంజాయి పాకెట్స్‌లను కొనుగోలు చేశారు. వాటిని మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాలలో ఎక్కువ ధరకు అమ్ముతూ లాభాలు గడిస్తున్నారు. ఎప్పటిలాగే



వీరందరూ వారం క్రితం సీలేరు ప్రాంతం వెళ్లి అక్కడ 110 గంజాయి ప్యాకెట్లు 4 వేలకు కొనుగోలు చేసి ఉట్నూర్ కేంద్రంగా నివాసముండే తుకారాం ఇంట్లో నిల్వ చేశారు. మహారాష్ట్రలో అమ్మడానికి రెండు ఎర్టిగా కార్లలో వెళుతుండగా విశ్వసనీయ సమాచారం మేరకు మావల బైపాస్ వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న క్రమంలో నలుగురు పారిపోయారు. మిగిలిన నలుగురిని పట్టుకొని కారులో ఉన్న 44 గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే రెండు కార్లతోపాటు నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీన పర్చుకున్నారు. సమావేశంలో సీఐలు బి.రఘుపతి, ఈ.చంద్రమౌళి, మావల ఎస్సై విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఎక్సైజ్ దాడులు



నవతెలంగాణ-కడెం

మండలంలోని వివిధ ప్రాంతాల్లో గురువారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించామని ఎక్సైజ్ ఎస్సై రాయబారపు రవికుమార్ తెలిపారు. ఈ దాడుల్లో నాలుగు కేసులు నమోదు చేశామని అన్నారు. ఇద్దరిని అరెస్ట్ చేసి, ఇద్దరిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. కైరం లక్ష్మి లింగాపూర్ (4 లీటర్లు), బానావత్ లత లక్ష్మీసాగర్ తండ (4 లీటర్లు), బానావత్ యమున చిన్న బెల్లాల్ (6 లీటర్లు), పాల్తియా అమ్మి, చిన్న బెల్లాల్ (6 లీటర్లు)ల వద్ద నిషేధిత గుడుంబా అమ్మడానికి సిద్ధంగా ఉండగా కనుగొని స్వాధీనం చేసుకుని వీరిపై నాలుగు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. నిషేధిత గుడుంబా తయారుకై సిద్ధంగా మూడు ప్లాస్టిక్ డ్రమ్ములలో పులియబెట్టబడిన బెల్లం పానకం సుమారు మూడు వందల లీటర్లు కనుగొని నేర స్థలాల వద్ద ధ్వంసం చేసి ఒక కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

- ఎంపీపీ కనక మోతుబాయి



నవతెలంగాణ-నార్నూర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన రెండో విడత కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కనక మోతుబాయి అన్నారు. గురువారం మండలంలోని ఖైర్‌డాట్వా గ్రామ పంచాయతీలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏండ్ల పైబడిన ప్రతి ఒక్కరూ కంటి వెలుగులో పరీక్షలు చేయించుకొని రక్షణ పొందాలని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కనక సెవంతా ప్రభాకర్, ఉపసర్పంచ్ భగీరథ, కార్యదర్శి మమత, గ్రామ పటేల్ నారంజీ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డీసీసీ అధ్యక్షులు సాజిద్ ఖాన్, ఏఐసీసీ సభ్యురాలు గండ్రత్ సుజాతలు డిమాండ్ చేశారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా పట్టణంలోని పిట్టల వాడ కాలనీలో గురువారం కాంగ్రెస్ నాయకులు పర్యటించారు. కాంగ్రెస్ హయంలో జరిగిన అభివృద్ధి, అధికారంలోకి వస్తే చేపట్టే కార్యక్రమాల వివరాలను తెలుపుతూ డిక్లరేషన్ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంజీవ్‌రెడ్డి, నగేష్, వసీం, షకీర్, అమీర్ పాల్గొన్నారు.

బెజ్జూరులో ఉచిత దంత వైద్య పరీక్షలు

నవతెలంగాణ-జైపూర్

మండలంలోని బెజ్జాల గ్రామంలో గురువారం ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ జయపాల్‌గౌడ్ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణానికి చెందిన శ్రీకాంత్ డెంటల్ ఆసుపత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. గ్రామ పంచాయతీ పరిధిలో పంటి సమస్యలతో బాధపడుతున్న వారిని పరీక్షించిన ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దంతాల పట్ల నిర్లక్ష్యం చేయొద్దని, పంటిని సురక్షితంగా కాపాడుకోవాలని వైద్య నిపుణులు శ్రీకాంత్, ఖయ్యూం, రేణుక సూచించారు. ఉచితంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో సుమారుగా 60 మంది దంత పరీక్షలు చేయించుకున్నట్లు సర్పంచ్ జయపాల్‌గౌడ్ తెలిపారు. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినందుకు శ్రీకాంత్ డెంటల్ ఆసుపత్రి వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-లక్షెట్టిపేట్



మున్సిపాలిటీలో పిచ్చికుక్కల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని గంగారోడ్ యువకులు గురువారం మున్సిపల్, తహసీల్దార్ కార్యాలయలలో వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా యువకుల సంఘం ప్రతినిధి బషీద్ మాట్లాడుతూ మూడు రోజుల క్రితం ఆదివారం పిచ్చి కుక్కలు 11 మందిని కరవడంతో పట్టణ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. మళ్లీ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా మున్సిపల్, రెవెన్యూ అధికారులు స్పందించి వెంటనే పిచ్చికుక్కలను సంహరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమీఉద్దీన్, వహీద్, సాజిద్ ఖాన్, జావిద్‌ఖాన్, జహీద్‌ఖాన్, రాములు, తిరుపతి పాల్గొన్నారు.

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

- సీఐటీయూ జిల్లా నాయకుడు వెలిశాల కృష్ణమాచారి



నవతెలంగాణ-కౌటాల

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు వెలిశాలకృష్ణమాచారి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని స్కీం వర్కర్లతో సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ స్కీం వర్కర్ల సమస్యలను పరిష్కారానికి ఏప్రిల్ 5న సీఐటీయూ ఆధ్వర్యంలో ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి స్కీం వర్కర్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్, పెన్షన్ సౌకర్యం కల్పించాలని తదితర డిమాండ్లతో కార్మిక, ఉద్యోగలు, సంఘటిత, అసంఘటిత కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఆయన వెంట హమాలీలు విఠల్, అశోక్, సంతోష్, వెంకటి, దేవాజీ, అంజన్న, సునీల్, విలాస్ ఉన్నారు.

గ్రామాల్లో అదనపు కలెక్టర్ పర్యటన

నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని పలు గ్రామాల్లో గురువారం మంచిర్యాల అదనపు కలెక్టర్ బి.రాహుల్ పర్యటించారు. మేదరిపేటలోని కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించి వైద్య శిబిరానికి వచ్చిన రోగులతో మాట్లాడారు. సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. కంటి వెలుగు శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలోని పంచాయతీ కార్యాలయం సందర్శించి రికార్డులు పరిశీలించారు. గ్రామంలోని రోడ్లు, మురుగు కలలను పరిశుభ్రంగా ఉంచాలని, తడి-పొడి చెత్త వేరువేరుగా చేయాలని సూచించారు. మామిడిపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. గ్రామ పంచాయతీలోని రికార్డులను పరిశీలించారు. గ్రామంలో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్లేశం, ఎంపీఓ సత్యనారాయణ పాల్గొన్నారు.

యువతి వివాహానికి మట్టేలు అందజేత

దండేపల్లి : మండలంలోని కొత్త మామిడిపల్లి గ్రామానికి చెందిన సత్తయ్య-లక్ష్మీల చిన్న కూతురు మౌనిక వివాహానికి మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు పుస్తెలు, మట్టెలు పట్టుచీర అందించి ఆశీర్వదించారు. మౌనికకు కుటుంబ పెద్ద దిక్కు లేకపోగ బీద కుటుంబం కావడంతో స్థానిక జడ్పీటీసీ గడ్డం నాగరాణి త్రిమూర్తి ప్రేమ్‌సాగర్ రావు దష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి పుస్తెలు మట్టలు పట్టుచీర అందించినట్లు అంతజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, కాంగ్రెస్ నాయకులు ఆకుల దుర్గాప్రసాద్, ఇప్ప సురేందర్, భత్తుల రమేష్, ఆరేపల్లి రమేష్, ముక్కెర మహేష్, సంతోష్, తిరుపతి, రాజేష్, జంగు, అజయ్, సాగర్, సందీప్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

మండలంలోని కొత్త మామిడిపల్లి గ్రామం చెందిన కొదురుపాక మౌనిక అనే నిరుపేద యువతి వివాహానికి స్థానిక నాయకులు చుంచు శ్రీనివాస్ పెళ్లి ఖర్చులకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. మౌనికది పేద కుటుంబం కావడంతో స్థానిక ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్ రావు దృష్టికి తీసుకెళ్లగా నడిపల్లి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నడిపెల్లి విజిత్ రావు ఆర్థిక సాయం చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నలిమెల మహేష్, పత్తిపాక సంతోష్ పాల్గొన్నారు.

కంటి వెలుగు కేంద్రాన్ని సందర్శన

తాండూర్ : మండలంలోని రేచీని గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని జిల్లా వైద్యాధికారి సుబ్బారాయుడు గురువారం సందర్శించారు. కంటి వెలుగు కార్యక్రమానికి ప్రజల నుంచి వస్తున్న స్పందనను రికార్డుల ద్వారా పరిశీలించారు. అద్దాల పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించి సిబ్బంది పనితీరును పరిశీలించారు. తాండూర్ వైద్యాధికారి కుమారస్వామి మండలంలోని కంటి వెలుగు కార్యక్రమాల వివరాలను డీఎంహెచ్ఓకు వివరించారు. మండలాల్లో రెండు బృందాలు కంటి వెలుగు వైద్య సేవలను అందిస్తున్నట్టు తెలిపారు.

ఊరులోకి వచ్చిన చుక్కల దుప్పి

కాగజ్‌నగర్ రూరల్ : నజ్రూల్‌నగర్ విలేజ్ నంబర్ 9 గ్రామంలోకి గురువారం చుక్కల దుప్పి వచ్చింది. ఊరు కుక్కలు పరుగెత్తించడంతో కంచ పొదల్లో చిక్కుకుంది. గుర్తించిన గ్రామస్తులు అటవిశాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడ్డ చుక్కల దుప్పిని వాహనంలో కాగజ్‌నగర్ పశు వైద్యశాలకు తీసుకెళ్ళగా పశువైద్యాధికారి విజయ్ కుమార్ వైద్య పరీక్షలు నిర్వహించి తల, గద్వ భాగం తీవ్ర గాయం కావడంతో మెరుగైన వైద్యం నిర్వహించారు. వాహనంలో తీసుకువచ్చిన అడవి శాఖ అధికారులు బీట్ ఆఫీసర్ సతీష్, వాచ్మెన్ సుధాకర్, ప్రశాంత్, ఆరిఫ్ ఉన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

భీమారం : మండలంలోని ఎల్కేశ్వరం, కొత్తపల్లి, బూర్గుపల్లి గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను హరిత హారం అకౌంటెంట్ జనరల్ (ఏజి), కమిటీ సభ్యులు గురువారం పరిశీలించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా చేపట్టిన తెలంగాణ హరితహారం కార్యక్రమంలో జీపీ నర్సరీలను పెంపొందిస్తున్న మొక్కలు, పల్లె ప్రకృతి వనాలను పరిశీంచారు. లక్ష్యానికి అనుగుణంగా హరిత హారం పథకాన్ని గ్రామీణ ప్రాంతాల ప్రజలు వినియోగించుకుంటు ఉపాధి పొందాలని సూచించారు. కమిటీ సభ్యులతో ఎంపీడీఓ శ్రీనివాస్, ఆయా గ్రామాల సర్పంచులు కొడిపె సమ్మయ్య, గోదారి తిరుపతి, వడ్లకొండ రమాదేవి, ఏపీఓ ఎస్తర్ డేవిడ్, ఈసీ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు సవ్య వసుంధర దేవి, రాజశేఖర్, టెక్నికల్ అసిస్టెంట్‌లు శివాజీ, శరత్, చందూలాల్ పాల్గొన్నారు.

కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలి

భీమారం : రెండో విడత కంటివెలుగు కార్యాక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆరెపల్లి గ్రామ ప్రజలను స్థానిక సర్పంచ్ అనపర్తి సునిత కోరారు. గురువారం గ్రామ పంచాయితీ కార్యాలయంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే మార్చి ఒకటో తేది వరకు వారం రోజుల పాటు నిర్వహించే కంటి శిబిరాన్ని 18 సంవత్సరాలు నిండి ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటి సమస్యలు ఉన్నవారు ఇట్టి అవకాశాన్ని తప్పకుండా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్వేత, ఎంపీడీఓ సతీష్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రవి కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తటిలో తప్పిన పెను ప్రమాదం

- ఎస్ఆర్‌పీ-3,3ఎ గనిలో గ్యాస్ లీక్
- ఇద్దరికి అస్వస్థత

నవతెలంగాణ-నస్పూర్



ఎస్ఆర్‌పీ-3,3ఎ గనిలోని 34 డిస్టిక్ సెకండ్ లెవెల్ 3వ సీమ్‌లో ఉదయం గ్యాస్ లీక్ అయింది. అక్కడ విధులు నిర్వహిస్తున్న హాలర్ ఆపరేటర్ రజినీకాంత్ గ్యాస్ లీక్ అవుతున్న ప్రదేశాన్ని మధ్యాహ్నం రెండు గంటల పది నిమిషాల సమయంలో గుర్తించడంతో పెను ప్రమాదం తప్పింది. గ్యాస్ విస్తరించడంతో గొంతు నొప్పి రావటంతో వెంటనే ఈ విషయాన్ని సర్దార్‌కు తెలియజేయడంతో అక్కడే ఉన్నా డిస్ట్రిక్ట్ సర్దార్ ఈ ప్రమాదం గురించి పైన ఉన్న మ్యానువే అధికారులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే ఆ ప్రదేశంలో పనిచేస్తున్న 23 మంది కార్మికులను అవతల వైపు తీసుకువచ్చారు. అదే సమయంలో పది రేస్‌లో పనిచేస్తున్న ఎర్రవెల్లి రవి వాంతులు చేసుకున్నాడు. అతన్ని వైద్య సేవల నిమిత్తం ఆర్కే-8 ఆస్పత్రికి తరలించి అనంతరం ఏరియా హాస్పిటల్‌కి తీసుకెళ్లారు. ఇంటికి వెళ్లిన రజినీకాంత్ కూడా అసస్తతకు గురి కావడంతో ఆస్పత్రికి చేరుకున్నాడు. వీరిద్దరిని మెరుగైన వైద్య సేవల నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. గ్యాస్ లీక్ అవ్వడంతో మంటలు ఏర్పడి పొగ గని అవతలి వైపుకు వ్యాపించకుండా వెంటనే సింగరేణి రెస్క్యూ టీం సభ్యులను రప్పించి, ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. ఈ ప్రమాదం విషయం తెలుసుకున్న సీఐటీయూ, టీబీజీకేఎస్, ఏఐటీయూసీ, హెచ్ఎంఎస్, బీఎంఎస్ నాయకులు చేరుకొని ప్రమాదానికి గల కారణాలను అధికారులను కార్మికులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి గురైన కార్మికులను ఆస్పత్రిలో పరామర్శించారు. ప్రమాదం వలన రెండో షిఫ్ట్ విధులకు హాజరయ్యే కార్మికులను విధులకు వెళ్లకుండా నిలిపివేశారు. దీనితో సుమారు 200 మందికి పైగా కార్మికులు గని ఆవరణలోనే ఉన్నారు. ఒక్క షిఫ్ట్ లోనే దాదాపు 250 టన్నుల మీద ఉత్పత్తి నిలిచిపోయింది.

ప్రజారక్షణకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలి

- ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్ కుమార్
- పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



పోలీస్ వ్యవస్థ బాధ్యత యుతమైనదని ప్రజారక్షణకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్ కుమార్ అధికారులకు సూచించారు జిల్లా కేంద్రంలోని హెడ్ క్వార్టర్స్ నుంచి అన్ని పోలీస్‌స్టేషన్ల అధికారులతో సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజల ధన, మాన, ప్రాణాలను కాపాడడంలో పోలీస్ పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. విధి నిర్వహణలో అప్రమత్తత ముఖ్యమని, సమయం, సందర్భాన్ని బట్టి డ్యూటీలో మార్పులు ఉంటాయని వాటికి అనుగుణంగా పనిచేయాలని సూచించారు. ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగే చిన్న చిన్న సంఘటనలు, గొడవలు పట్ల కౌన్సిలింగ్ నిర్వహించాలని, అనవసర విషయాల పట్ల పోలీస్ సిబ్బంది చాకచక్యంగా ఉండాలని పేర్కొన్నారు. నిషేధిత మత్తు పదార్థాల పట్ల కఠినంగా వ్యవహరించాలని, ఏ ముఖ్య సమాచారమైన, సమస్యలైనా డయల్ 100కు కాల్ చేసి తెలియజేసేలా ప్రజలను చైతన్య పరచాలని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటు ఆవశ్యకత గురించి ప్రజల్లో చైతన్యపరచాలని, నేరాలను అదుపు చేయడానికి సీసీ కెమెరాల ముఖ్య పాత్ర వహిస్తాయని తెలిపారు. పోలీస్ అధికారులు సిబ్బంది ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో పనిచేయడం ముఖ్యమని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ఎఆర్ భీమ్‌రావు, టాస్క్‌ఫోర్స్ సీఐ సుధాకర్, ఐటీ కోర్ ఎస్సై ప్రవీణ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

నవతెలంగాణ-జైనూర్



తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు అన్నారు. గురువారం మండలోని బూసిమెట్ట గ్రామ సమీపంలోని గురుకుల బాలికల పాఠశాల, కళాశాలను మధ్యాహ్న బోజన సమయంలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని సంబందిత అధికారులను హెచ్చరించారు. ప్రభుత్వం గిరిజన విద్యార్థులకు అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పిస్తున్నా కూడా అధికారుల నిర్లక్ష్యంతోనే బాలికలకు నాణ్యమైన భోజనం అందించడంలేదని అసహనం వ్యక్తం చేశారు. నూతనంగా పాఠశాలకు భవనం ఏర్పాటుచేసి విశాలమైన భవనంతో పాటు అన్ని విధాలుగా మౌళిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. అందులో కేవలం సంబంధిత పాఠశాల వార్డెన్ నిర్లక్ష్యంతోనే విద్యార్థులకు సరైన భోజనం అందటంలేదని విమర్శించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఆయనకు ఫిర్యాదు చేయడంతోనే పాఠశాల, కళాశాలను సందర్శించి మెనూ ప్రకారం భోజనం అందించడంలేదని స్వయంగా విద్యార్థులు చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత కళాశాల ప్రిన్సిపల్, వార్డన్‌కు విద్యార్థులకు సరైన భోజనం ఎందుకు పెట్టడంలేదని అడిగితే పాఠశాలకు సంబంధించిన సరుకులు సరిగా పంపిణీ చేయకపోవడంతోనే నిర్లక్ష్యం జరుగుతుందని తెలిపారు. వెంటనే కళాశాల నుండి జిల్లా ఆర్‌సీఓ గంగాధర్‌ను ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఉన్నతాధికారుల నిర్లక్ష్యంతోనే పాఠశాలలో విద్యార్థులకు భోజనం అందించడంలేదని, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం పాఠశాలలో నిత్యవసర సరుకులు వెంటనే పంపిణీ చేసి పాఠశాల విద్యార్థులను ఆదుకోవాలని తెలిపారు. టెండర్లు అయినా కూడా సరైన సరుకులు పంపిణీ చేయకపోవడంతోనే పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల వివరాలను స్థానిక ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మొత్తం 640 మంది విద్యార్థులు ఉండగా అందులో 520 మంది విద్యార్థులు హాజరుకావడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. సంబంధిత పాఠశాల ఉపాధ్యాయుల పనితీరుపై జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. ఆయన వెంట నేతకానీ రాష్ట్ర కన్వీనర్ జాడి రవీందర్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గొడం లక్ష్మణ్, ఉన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

రెబ్బెన : మండలంలోని ఫారెస్టు నర్సరీలో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ డిమాండ్ చేశారు. గురువారం ఎఫ్ఎస్ఓ ఎం.కొమ్మాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం రవీందర్ మాట్లాడుతూ ఫారెస్టు నర్సరీ కార్మికులు 10 ఏండ్ల నుండి చాలీచాలనీ వేతనాలు తీసుకుంటూ పనిచేస్తున్నారని, ప్రభుత్వం శ్రమ దోపిడీకి గురి చేస్తోందని పేర్కొన్నారు. కనీస కూలి రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. మార్కెట్‌లో ప్రతి రోజు నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో ప్రస్తుతం చెల్లిస్తున్న రూ.250 కుటుంబాన్ని పోషించుకోలేక నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే కార్మికులకు కూలి రేట్లు పెంచడంతో పాటు రవాణా ఖర్చులు కూడా చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. నర్సరీలో పనిచేస్తున్న కార్మికులకు ఎక్స్‌గ్రేషియా రూ.20లక్షలు చెల్లించడంతో పాటు ప్రతి కార్మికుడికి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం రవీందర్, ఫారెస్టు నర్సరీ కార్మికులు సుమలత, సంఘమిత్ర, మీనాక్షి, సుజాత, మాయ, కౌసల్య, తారాబాయి పాల్గొన్నారు.

భవన ప్రారంభానికి పూర్తిస్థాయి చర్యలు

ఆసిఫాబాద్ : ప్రభుత్వ సేవలు అన్ని ఒకే చోట లభించాలని ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ అధికారులను ఆదేశించారు. గురువారం భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవనం ప్రహరీ గోడ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, వర్షాకాలంలో వర్షపు నీరు నిలువ ఉండకుండా నాలాల నిర్మాణం చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం హెలిపాడ్ నిర్మాణ పనులు, సమావేశ మందిరం, కలెక్టర్ చాంబర్, వివిధ శాఖలకు కేటాయించిన కార్యాలయాలలో అధికారుల చాంబర్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్ పాల్గొన్నారు.

పోచమ్మ గుడి నిర్మాణానికి భూమి పూజ

దండేపల్లి : మండలంలోని ద్వారక గ్రామంలో రూ.12 లక్షల దేవాదాయ శాఖ నిధులతో నిర్మించ తలపెట్టిన పోచమ్మ గుడికి మంచిర్యాల ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్ రావు భూమి పూజ నిర్వహించి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పలుమార్లు గ్రామస్తులు గుడి నిర్మాణం విషయాన్ని తమ దృష్టికి తీసుకురాగా గుడి నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యేవిధంగా కృషి చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, వైసీపీ అనిల్ కుమార్, సహకార సంఘం చైర్మన్ కాసనగోట్టు లింగన్న, పార్టీ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్ పాల్గొన్నారు.

నట్టల నివారణ మందులు పంపిణీ

నవతెలంగాణ-తాండూర్

దూడలు సురక్షితంగా ఎదగాలంటే నట్టల నివారణ మందు వేయించాలని పశువైద్యాధికారి భూమయ్య తెలిపారు. గురువారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలోరాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన గొర్రెలు, మేకలకు ఉచిత నట్టల నివారణ మందులు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల్లో ఏలిక పాముల సమస్య వల్ల అరుగుదల శక్తి నశించి పశువులు చనిపోయే ప్రమాదం ఉందన్నారు. క్రమం తప్పకుండా నట్టల మందు తాగిపించినట్లయితే దూడలు ఆరోగ్యవంతంగా ఎదిగి పశువులుగా పరిణతి చెందుతాయి అన్నారు. మండలంలో ప్రతి గ్రామంలో నట్టల మందు కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కొత్తపల్లి సర్పంచ్ ఎలుపుల రజిత.రాజు, ఉపసర్పంచ్ చిర్ల రాజేశం, పశువైద్య సిబ్బంది గౌస్. కళ్యాణ్, నరేష్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశ దరఖాస్తు గడువు పెంపు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి 6 నుంచి 10వ తరగతులలో ప్రవేశం కొరకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేయుటకు తుది గడువు మార్చి 1వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. ఈ గడువు ఈ నెల 22న ముగియగా మరో వారం రోజులు పెంచినట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేయుటకు సమీప మీసేవా కేంద్రాల్లో లేదా ఇంటర్‌నెట్ సెంటర్‌లో సంప్రదించి తెలంగాణఎంఎస్.సీజీజీ.జీఓవీ.ఇన్ వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎమ్మెల్యే జోగు రామన్న అబద్ధాలకోరు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

ఎమ్మెల్యే జోగు రామన్న పచ్చి అబద్దాలకోరని బీజేపీ యువ నాయకుడు, అడ గ్రామ సర్పంచ్ పాయల్ శరత్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఒక గ్రామ సభలో ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడిన తీరును ఖండించారు. సర్పంచ్ స్థాయి నుండి మంత్రి పదవి వరకు పదవులు చేపట్టిన ఆయనకు పాలన వ్యవహారం తెలియదా? అని సూటిగా ప్రశ్నించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధుల గురించి అవగాహన లేమితో మాట్లాడారని పేర్కొన్నారు. ఎంపీ సోయం బాపురావు గురించి అనుచితంగా మాట్లాడడం తన స్థాయికి తగదన్నారు. అడ గ్రామానికి నిధులు ఇచ్చానని, అభివృద్ధి పనులు చేశానని పచ్చి అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. ఒక్క అడ గ్రామంలోనే కాదు బీజేపీ సర్పంచులున్న ఏ గ్రామంలో కూడా ఆయన అభివృద్ధి పనులు ప్రారంభించలేదని తెలిపారు. విలేకరుల సమావేశంలో బీజేపీ సర్పంచులు రతన్‌రెడ్డి, ఉజ్వల, నాయకులు లోక ప్రవీణ్‌రెడ్డి, రాందాస్, రమేష్, సుభాష్ పాల్గొన్నారు.

వీఓఏల మండల కమిటీ నియామకం





నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఐకేపీ వీఓఏల మండల కమిటీని గురువారం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్ ప్రకటించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా సెల్వట్‌కార్ బుద్ధు, ప్రధాన కార్యదర్శిగా కీర్తి రమ, ఉపాధ్యక్షులుగా కట్కర్ కల్పన, గండే సునీత, సహాయ కార్యదర్శులుగా జాడి ఒమాజి, రేకల సుదర్శన్, ప్రచారకార్యదర్శిగా పుర్క జైవంత్, జ్యోతి, కోశాధికారిగా దుర్గం రమాదేవిలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కమిటీ సభ్యులుగా వేములవాడ రమేష్, నగిరాడే ప్రవీణ్, చందేకర్ జ్యోతి, కవిత, సుదీర్, అర్చనలను ఎంపిక చేసామని సభ్యులు సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉండి ముందుకు సాగాలని సూచించారు.

మరో బస్సు నడపాలి

నవతెలంగాణ-జన్నారం

ఆదిలాబాద్ డిపో నుంచి ఉట్నూర్, జన్నారం మీదుగా మరొక సూపర్ లగ్జరీ బస్సు నడపాలని, తెలంగాణ నేతకాని మహర్ విద్యార్థి సంఘ రాష్ట్ర అధ్యక్షులు సాయిని ప్రసాద్ అన్నారు. గురువారం ఆదిలాబాద్ డిపో మేనేజర్‌కు సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జన్నారం మీదుగా రోజుకు వందలాదిమంది హైదరాబాద్ వివిధ పనులకు వెళుతున్న సందర్భంలో ఒకటే సూపర్ లగ్జరీ బస్సు ఉన్నందున ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి వెంటనే మరొక సూపర్ లగ్జరీ బస్సు వేయాలని కోరారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ - బెజ్జూర్

మండలంలోని తిక్కపల్లి గ్రామానికి చెందిన ఎల్లూరు లింగయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించడంతో మృతుడి కుటుంబసభ్యులను ఎమ్మెల్యే కోనేరు కోనప్ప గురువారం పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను అన్ని రకాలుగా ఆదుకుంటామని తెలిపారు. ప్రభుత్వం ద్వారా ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తానని భరోసా కల్పించారు. ఆయన వెంట ఎంపీపీ డుబ్బుల నానయ్య, పాపన్‌పేట ఎంపీటీసీ శ్రీనివాస్, మాజీ పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఇస్తారి ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

నవతెలంగాణ - దహెగాం

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీటీసీ శ్రీరామారావు అన్నారు. గురువారం మండలంలోని కల్వాడ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కృషి వల్లనే గ్రామానికి రోడ్లు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ హాత్కర్ గోపీబాయి, ఉప సర్పంచ్ శేఖర్, ఏపీఓ కల్పన, నాయకులు మధూకర్, పుప్పాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

మందమరి పట్టణానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త రియాజ్ అకాల మరణం చెందడంతో కుటుంబాన్ని గురువారం రామకృష్ణాపూర్, మందమర్రి పట్టణ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, జె.రవీందర్ పరామర్శించారు. బాల్క ఫౌండేషన్ ద్వారా తక్షణ ఆర్థిక సహాయంగా రూ.10వేలు అందించారు. ఈ కార్యక్రమంలో అబ్బాస్, బడికల సంపత్, బత్తుల శ్రీనివాస్, సదానందం, ఇసాక్, రామకృష్ణాపూర్ కౌన్సిలర్లు జాడి శ్రీనివాస్, రేవెల్లి ఓదేలు, యువజన నాయకుడు ముస్తఫా, బెల్లం అశోక్, అరుణ్, ఎండి గౌస్ పాల్గొన్నారు.

సింగరేణి ఆధ్వర్యంలో వైద్య శిబిరం

నవతెలంగాణ- కాసిపేట

మండల కేంద్రంలో గురువారం ఆజాద్ కా అమృత్ మహోత్సవ్ సందర్భంగా సింగరేణి ఏరియా ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వ్యాధులకు మందులను అందించారు. దీంతో పాటు వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యూకేటర్ రామ్మోహన్, వైద్య సిబ్బంది మల్లేశ్వరి, మహేశ్ పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన జిల్లా జడ్జి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని జిల్లా జడ్జి రవీంద్ర శర్మ, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు, జూనియర్ సివిల్ జడ్జి ఉమామహేశ్వరి, అడిషనల్ జ్యూడిషల్ మెజిస్ట్రేట్ షరీనాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుండి కేసుల నిమిత్తం జిల్లా కేంద్రంలోని కోర్టుకు అనేకమంది వస్తారని, వేసవికాలంలో చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. చలివేంద్రం ప్రారంభానికి ఆర్థిక సహాయం అందజేసిన అడ్వకేట్లు ముక్త సురేష్, తాటిపల్లి సురేష్, చరణ్ తేజ, నరహరి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్ బాబునుతో పాటు పలువురిని అభినందించారు.

కబ్జాకు గురైన ప్రభుత్వ భూమి స్వాధీనం

నవతెలంగాణ- కాసిపేట

మండలంలోని రొట్టెపల్లిలో కబ్జాకు గురైన రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం తహసీల్దార్ దిలీప్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ వీవీఆర్కేడీ ప్రసాద్ ఆధ్వర్యంలో రెవెన్యూ బృందం ఆక్రమణకు గురైన భూమిని పరిశీలించి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న భూమిని బృహత్ పల్లెప్రకృతి వనం ఏర్పాటుకు ప్రతిపాదించారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు ఉంటాయని తహసీల్దార్ దిలీప్ కుమార్ స్పష్టం చేశారు.